సాక్షి
నిజామాబాద్

గురువారం । 20 । జూన్ । 2024



అవినీతికి తావు లేకుండా..

అవినీతికి తావు లేకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు.

- 8లో ▸



ఉర్దూఘర్‌కు పూర్వవైభవం

బోధన్‌లోని ఉర్దూ ఘర్‌కు పూర్వ వైభవం తీసుకు వస్తామని ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.0 /24.2

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

స్థానికం తరువాతే!

పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతోనే నామినేటెడ్ పదవుల కోసం ఆశావహులు మళ్లీ తమ ప్రయత్నాలు మొదలు పెట్టారు. అధిక సంఖ్యలో ఆశావహులు ఉండగా జిల్లా స్థాయిలో రెండు మూడు మాత్రమే కీలకమైన నామినేటెడ్ పదవులు ఉన్నాయి. దీంతో కొందరు నాయకులను జెడ్పీ, మున్సిపల్ చైర్మన్ల స్థానాల్లో భర్తీ చేసి, మిగిలిన నాయకులకు నామినేటెడ్ పదవులు కట్టబెట్టేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

- నామినేటెడ్ పదవుల భర్తీ?
- ఆశావహుల్లో ఎడతెగని ఉత్కంఠ
- మరికొన్ని నెలలు ఎదురుచూపులు తప్పవా?



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తి కావస్తోంది. పదేళ్ల పాటు అధికారానికి దూరంగా ఉన్న జిల్లాకు చెందిన పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు నామినేటెడ్ పదవుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటి నుంచి తమవంతుగా గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మంత్రివర్గంలోనూ ఇప్పటివరకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం కల్పించలేదు. కేబినెట్ పదవి విషయంలోనూ పార్టీ శ్రేణుల్లో ఎదురుచూపులు తప్పడం లేదు. జిల్లా నుంచి కేబినెట్ బెర్త్ రేసులో పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ఉన్నారు. పీసీసీ అధ్యక్ష పదవి రేసులో బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ ఉన్నారు. నామినెటేడ్ పదవుల రేసులో పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. నామినేటెడ్ ఆశావహులు మాత్రం ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి హైదరాబాద్ చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఈ క్రమంలో మధ్యలో లోక్‌సభ ఎన్నికలు రావడంతో రెండునెలల పాటు నామినేటెడ్ పదవుల పందేరానికి బ్రేక్ పడింది. పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ సైతం పూర్తి కావడంతో నామినేటెడ్ ఆశావహులు మళ్లీ తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆశావహుల్లో ఎక్కువమంది ఎక్కువ సమయం రాజధానిలోనే గడుపుతున్నారు. పార్టీ శ్రేణులు సైతం ఎడతెగని ఉత్కంఠతో ఉన్నాయి. అయితే ప్రభుత్వం మాత్రం మరో ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల తరువాతనే నామినేటెడ్ పదవుల భర్తీకి నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పటికే గ్రామ పంచాయతీల పదవీ కాలం ముగిసింది. ప్రత్యేక అధికారుల పాలన నడుస్తోంది. మరోవైపు జిల్లా, మండల ప్రజాపరిషత్ పదవుల కాలపరిమితి వచ్చే నెల 4న ముగియనుంది. అదేవిధంగా పురపాలక, నగరపాలక సంస్థల పదవీకాలాలు ముగిసే సమయం సమీపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ స్థానిక సంస్థల ఎన్నికలన్నింటినీ ఒకటి రెండు వారాల వ్యవధిలో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఆశావహులు ఎందరో..

జిల్లాలో నామినేటెడ్ పదవుల విషయంలో ఆశావహుల సంఖ్య భారీగా ఉంది. రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల చైర్మన్ పదవుల కోసం కొందరు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఆశావహులందరికీ రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల పదవుల పంపిణీ కష్టతరమైన నేపథ్యంలో జిల్లాలోని కీలకమైన నామినేటెడ్ పదవులను కట్టబెట్టేందుకు ప్రభుత్వం, పార్టీ పెద్దలు నిర్ణయించారు. జిల్లా స్థాయిలో రెండు మూడు పదవులు మాత్రమే కీలకమైన నామినేటెడ్ పదవులు ఉండడంతో ఎంపిక కష్టతరంగా మారింది. అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి ఉన్నందున కీలకమైన కొందరు నాయకులను జిల్లా ప్రజాపరిషత్, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, మున్సిపల్ చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ల పదవులకు ఎన్నికయ్యేలా చేసి, ఆ తరువాత మిగిలిన నాయకులకు నామినేటెడ్ పదవులు కట్టబెట్టేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. పరిషత్ ఎన్నికలు ఎప్పటిలోగా పూర్తి చేస్తారనే విషయమై ఇప్పటివరకు ఒక స్పష్టత లేకుండా పోయింది. దీంతో స్థానిక ఎన్నికలతో పాటు నామినేటెడ్ పదవుల విషయమై మరికొంత కాలం పాటు నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు ఎదురు చూడక తప్పని పరిస్థితి నెలకొంది.



మోర్తాడ్‌లో విస్తరణకు నోచుకోనున్న జాతీయ రహదారి

ఇక వేగంగా విస్తరణ పనులు!

జాతీయ రహదారి 63ను విస్తరించాలని కేంద్రం నిర్ణయం

ఆర్మూర్/మోర్తాడ్ : నిధుల కేటాయింపులో తీవ్ర జాప్యం, భూ సేకరణ అంశం కొలిక్కి రాకపోవడం తదితర కారణాలతో పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారి 63 విస్తరణ పనులు ఇక నుంచి వేగంగా సాగనున్నాయి. మోదీ 3.0 వందరోజుల ప్రణాళికలో భాగంగా తెలంగాణలోని రెండు జాతీయ రహదారుల విస్తరణపై కేంద్రం దృష్టి సారించింది. ఇప్పటి వరకు ఈ రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగకపోగా మూడోసారి ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారం చేయడం, జాతీయ రహదారుల విస్తరణపై కేంద్రం దృష్టి సారించడంతో పనుల్లో కదలిక రానుంది. కేంద్రం ఎంపిక చేసిన రెండు రోడ్ల విస్తరణలలో జాతీయ రహదారి 63కు చోటు దక్కడంతో త్వరలోనే నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణం పనులకు బీజం పడనుందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. నిజామాబాద్–ఛత్తీస్‌ఘడ్‌లోని జగ్దల్‌పూర్‌ల మధ్య విస్తరించిన జాతీయ రహదారి 63పై భారీ ట్రక్కులు రవాణా జోరుగా సాగుతుండటంతో ఈ రోడ్డును విస్తరించాలని కేంద్రం గతంలోనే నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ఇప్పటికే జాతీయ రహదారి అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌ఎచ్‌ఏఐ)కి ప్రాజెక్టును అప్పగించారు. ఈ ప్రాజెక్టు కోసం కేంద్రం రూ.3,850 కోట్లు ఖర్చు చేయాలని అంచనాకు వచ్చింది. రాష్ట్రంలో ఆర్మూర్ నుంచి జగిత్యాల మీదుగా మంచిర్యాల్ వరకు 131.8 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ చేయనున్నారు. నిజామాబాద్ జిల్లాకు సంబంధించి రోడ్డు విస్తరణ, బైపాస్ రోడ్ల కోసం 83.895 హెక్టార్ల భూమిని సేకరించనున్నారు. జాతీయ రహదారి కోసం తాము వ్యవసాయ భూములు ఇవ్వబోమని రైతులు ఆందోళన కార్యక్రమాలను నిర్వహించారు. ఇప్పటి వరకు భూ సేకరణ ముందుకు సాగలేదు. కేంద్రం మాత్రం జాతీయ రహదారుల విస్తరణలో 63 నంబర్ హైవేకు అవకాశం ఇవ్వడంతో భూ సేకరణ, రోడ్డు విస్తరణ పనులు వేగంగా సాగనున్నాయని వెల్లడి అవుతుంది.

న్యూస్‌రీల్

303 మందికి పదోన్నతి

నిజామాబాద్ అర్బన్ : జిల్లా విద్యాశాఖలో పదోన్నతులకు సంబంధించి ఆర్డర్లను బుధవారం రాత్రి విద్యాశాఖ అధికారులు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 303 మందికి ఆర్డర్లు జారీ చేశారు. నేడు, రేపు మరో 500 వరకు ఆర్డర్ కాపీలు వచ్చే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది. తుది జాబితాలో పలు మార్పులు జరగడంతో ఆలస్యం జరిగింది. ఇది ఇలా ఉండగా కొందరు టీచర్లకు ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు ప్లేస్‌లు కేటాయించినట్లు తెలిసింది. సుమారు 12 మంది టీచర్లకు ఇదే విధంగా ఆర్డర్లు జారీ కావడంతో ఆలస్యం జరిగిందని విద్యాశాఖ పేర్కొంది.

బస్‌పాస్‌లకు అడ్మినిస్ట్రేటివ్ చార్జీలు చెల్లించాలి

ఖలీల్‌వాడి : ఉమ్మడి జిల్లాలోని విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల బస్‌పాస్‌ల కోసం అడ్మినిస్ట్రేటివ్ చార్జీలు చెల్లించాలని ఆర్‌ఎం జానీరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాస్‌లు ఇవ్వడానికి ఆరు డిపోలలో ఏర్పాట్లు చేశామన్నారు. చార్జీలు చెల్లించి విద్యాసంస్థలు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ పొందాలని సూచించారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో పాస్ కోసం అప్లై చేసుకోవాలన్నారు. ఆ దరఖాస్తును ఆయా విద్యా సంస్థలు అప్రూవ్ చేశాక పాస్ పొందవచ్చని వివరించారు. విద్యార్థినులు ఒరిజినల్ ఆధార్‌కార్డు చూయించి ఉచితం ప్రయాణం చేయొచ్చని పేర్కొన్నారు.

కాల్పోల్ ఘటనలో మరో నలుగురి రిమాండ్

మోపాల్ : మండలంలోని కాల్పోల్‌లో ఐదు రోజుల క్రితం ఫారెస్ట్ అధికారులపై దాడి చేసిన కేసులో గ్రామానికి చెందిన మరో నలుగురిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో గంగాధర్ తెలిపారు. జీవన్‌సింగ్, జైల్‌సింగ్, బాబులాల్, మచ్చును రిమాండ్‌కు తరలించారు. ఈనెల 16న 8 మందిని రిమాండ్ చేసిన విషయం తెలిసిందే. అటవీ భూమిని చదును చేస్తున్నారన్న సమాచారంతో అక్కడికెళ్లిన ఫారెస్ట్ అధికారులపై గ్రామస్తులు దాడి చేశారు. దాడిలో ముగ్గురికి బలమైన గాయాలయ్యాయి. ఇప్పటివరకు మొత్తం 12మందిని రిమాండ్ చేశారు. మిగతా వారి కోసం గాలిస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

ఖలీల్‌వాడి : నగరంలోని లక్ష్మి కల్యాణ మండపంలో కాంగ్రెస్ నిజామాబాద్ పార్లమెంట్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర కో ఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు. మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తదితరులు రానున్నట్లు పేర్కొన్నారు.

పంటల నమోదును సక్రమంగా నిర్వహించాలి



డిచ్‌పల్లి : వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల నమోదు సక్రమంగా నిర్వహించాలని డీఏవో వాజిద్ హుస్సేన్ ఆదేశించారు. పంటల నమోదు పరిశీలన కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ముల్లంగి (ఐ) గ్రామాన్ని డీఏవో సందర్శించారు. క్షేత్రస్థాయిలో పంట భూముల్లో పర్యటిస్తూ 15 సర్వే నంబర్లను పరిశీలించారు. ఏఈవోలకు పలు సూచనలు చేశారు. ఏవో రాంబాబు, ఏఈవోలు భావన, నృపేశ్, రైతులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల తనిఖీ



నిజామాబాద్ అర్బన్ : నగరంలోని పలు ప్రైవేట్ పాఠశాలలను బుధవారం డీఈవో దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు. శ్రీచైతన్య, ఎస్‌ఆర్ డిజీ స్కూళ్లను పరిశీలించారు. ఫీజుల వివరాలు, అర్హులైన టీచర్లు ఉన్నారా అని ఆరా తీశారు. ఫీజుల వివరాలు లేకపోవడం, పాఠ్య పుస్తకాలు అమ్మడంపై ఆగ్రహం వ్యక్తం చేసి, నోటీసులు జారీ చేశారు.

వెల్ఫేర్ ఆఫీసర్ల పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జూన్ 24 నుంచి 29 వరకు జరగనున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల వెల్ఫేర్ ఆఫీసర్ల నియామక రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ప్రారంభమయ్యే మూడ్రోజుల ముందు నుంచి కమిషన్ వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు కొనసాగుతాయన్నారు. బయోమెట్రిక్ విధానం ద్వారా వేలి ముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. మార్నింగ్ సెషన్‌కు సంబంధించి ఉదయం 8.30 గంటల నుంచి అభ్యర్థులను కేంద్రంలోనికి అనుమతిస్తారని, 9.30 గంటలకు పరీక్షా కేంద్రం గేట్లు మూసేస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు. మధ్యాహ్నం సెషన్ పరీక్షకు ఒంటి గంట నుంచి కేంద్రం లోనికి అనుమతిస్తారని, 2 గంటలకు గేట్లు మూసేస్తారని వివరించారు.

ఐటీఐలకు కొత్త హంగులు

మోర్తాడ్ : పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్(ఏటీసీ)లుగా అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఐటీఐలు కొత్త హంగులను సంతరించుకోనున్నాయి. ఐటీఐల అప్‌గ్రేడ్ కోసం ప్రభుత్వం ఇప్పటికే బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. జిల్లాలో బషీరాబాద్ (కమ్మర్‌పల్లి), భీమ్‌గల్, నిజామాబాద్ బాలుర, బాలికలు, బోధన్‌లలో ఐటీఐలు ఉన్నాయి. వీటిల్లో టైలరింగ్, కంప్యూటర్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్ కోర్సులు ఉన్నాయి. ఒక్కో ఐటీఐలో 240 వరకు సీట్లు భర్తీ అవుతున్నాయి. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌లుగా అప్‌గ్రేడ్ చేసి భవిష్యత్‌కు అవసరమైన రంగాల్లో శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఎలక్ట్రిక్ వెహికల్ మెకానిక్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్(మెకానికల్), ఆర్టిసన్ యూసింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, ఇండస్ట్రీయల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫాక్చరింగ్ టెక్నీషియన్, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెకానిక్ టెక్నీషియన్ కోర్సులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిపై విధివిధానాలు ఖరారైతే పూర్తిస్థాయి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



సమయం పడుతుంది

ఐటీఐలను అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు. అప్‌గ్రేడ్ విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. కొత్త కోర్సుల అమలు, ఇతర విషయాలు వెల్లడి కావడానికి కొంత సమయం పడుతుంది.

– శాంతారాం, ప్రిన్సిపాల్, ఐటీఐ బషీరాబాద్

రాష్ట్రస్థాయి అవార్డులు హర్షణీయం

- డీఆర్‌డీవో సాయాగౌడ్



జిల్లా సమాఖ్య సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాయాగౌడ్

డిచ్‌పల్లి : బ్యాంకు లింకేజీ రుణాల మంజూరులో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసి జిల్లా, డిచ్‌పల్లి మండల సమాఖ్య రాష్ట్రస్థాయి అవార్డులు సాధించడం సంతోషంగా ఉందని డీఆర్‌డీవో సాయాగౌడ్ అన్నారు. బుధవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని సాంకేతిక శిక్షణ అభివృద్ధి కేంద్రం (టీటీడీసీ)లో నిర్వహించిన జిల్లా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా బ్యాంకు లింకేజీ లక్ష్యాన్ని సాధించి రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలువడంలో కృషి చేసిన ఐకేపీ సిబ్బంది, జిల్లా సమాఖ్య ప్రతినిధులను ఆయన అభినందించారు. లోకోస్‌కు సంబంధించి అప్రూవల్స్‌లో రాష్ట్ర శాతం 60 ఉండగా, జిల్లా 90 శాతం అప్రూవల్స్‌తో అగ్రస్థానంలో ఉందన్నారు. సిబ్బంది అందరి సహకారంతో తక్కువ సమయంలోనే 70శాతం వరకు స్కూళ్లకు యూనిఫామ్స్ అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం రెండో సెట్ స్కూల్ యూనిఫామ్స్, అంగన్‌వాడీ పిల్లలకు యూనిఫామ్స్ కుట్టడానికి అవసరమైన వస్త్రం జిల్లాకు చేరుకుందన్నారు. యూనిఫామ్స్ కుట్టడానికి అవసరమైన బల్క్ కటింగ్ మిషన్లు, సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని డీఆర్‌డీవో సూచించారు. అడిషనల్ డీఆర్‌డీవో రవీందర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా వీవోల ఆడిట్ 15 రోజుల్లో 100 శాతం పూర్తి చేశామన్నారు. మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడానికి క్యాంటీన్‌ల నిర్వహణ, ఈవెంట్ మేనేజ్‌మెంట్, సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు వంటి వివిధ కార్యక్రమాలను మహిళలకు అప్పగిస్తామన్నారు. జిల్లా సెర్ప్ జేపీసీ ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ సాయాగౌడ్, అడిషనల్ డీఆర్‌డీఏ రవీందర్, డీపీఎం (బ్యాంకు లింకేజీ) నీలిమ, డిచ్‌పల్లి ఏపీఎం రజిత, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాధ, మండల సమాఖ్య అధ్యక్షురాలిని సన్మానించారు. సమావేశంలో డీపీఎంలు శ్రీనివాస్, సంధ్యారాణి, సాయిలు, మారుతి, ఏపీఎం సరోజిని, స్త్రీనిధి జిల్లా మేనేజర్ వరలక్ష్మి, జిల్లా సమాఖ్య కోశాధికారి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంటల మద్దతు ధర పెంపు

- ధాన్యం క్వింటాలుకు రూ.117 పెంచిన కేంద్రం



డొంకేశ్వర్(ఆర్మూర్) : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన 14 రకాల పంటలకు కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇందులో ఏ–గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.117 పెంచడంతో మద్దతు ధర రూ.2,320కు చేరింది. వరికి మద్దతు ధర పెంపుతో జిల్లాలో 2.60 లక్షల మంది రైతులకు మేలు జరగనుంది. జిల్లాలో అత్యధికంగా సాగయ్యే పంటల్లో వరి మొదటి స్థానంలో ఉంది. జిల్లా వ్యాప్తంగా 4.28 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుండగా, 12లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. రైతులు పండించిన ఈ ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధరను పొందుతున్నారు. అదే విధంగా సోయా క్వింటాలుకు రూ.229 పెరగ్గా రూ.4,892కు చేరింది. నువ్వులు క్వింటాలుకు రూ.432 పెంచడంతో రూ.9,262కు చేరుకుంది. మొక్కజొన్నకు రూ.135 పెంచడంతో రూ.2,225కు చేరింది. పత్తి, రాగులు, సజ్జలు, జొన్నలు, పొద్దు తిరుగుడు, వేరు శనగ, తదితర పంటలకు కూడా కనీస మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం పెంచడంతో కర్షకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా అధికారులతో ప్రభుత్వ సలహాదారు భేటీ

- మున్సిపాలిటీల్లో యూజీడీ, తాగునీటి సరఫరాపై ఆరా



షబ్బీర్ అలీకి మొక్కను అందజేస్తున్న కలెక్టర్

సుభాష్‌నగర్ : రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ బుధవారం జిల్లా అధికారులతో భేటీ అయ్యారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ భేటీ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి పలు అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రధానంగా జిల్లాలోని ఆయా మున్సిపల్ పట్టణాల్లో తాగునీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ తీరుతెన్నుల గురించి తెలుసుకున్నారు. అమృత్ పథకం కింద చేపట్టాల్సి ఉన్న మంచినీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు సంబంధించి కొంత ప్రతిష్టంభన నెలకొందని ప్రజారోగ్య శాఖ ఈఈ తిరుపతి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ దృష్టికి తేగా, ఆయన తక్షణమే స్పందించారు. అప్పటికప్పుడే ఫోన్లో సంబంధిత శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్‌ను సంప్రదించి, ప్రతిష్టంభన తొలగిపోయేలా చొరవ చూపారు. అమృత్ పథకం పనులకు ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు మంజూరు చేస్తామని ప్రిన్సిపల్ సెక్రెటరీ తెలిపారు. ఇతర అంశాలపై కూడా చర్చించిన ఆయన అధికారులకు కీలక సూచనలు చేశారు.

ఈ భేటీలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఏ హోదాలో సమీక్ష నిర్వహించారు?




మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీపై ఎమ్మెల్యే ధన్‌పాల్ ఆగ్రహం

సుభాష్‌నగర్ : నిజామాబాద్ కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్, ఇతర అధికారులతో షబ్బీర్ అలీ ఏ హోదాలో సమీక్ష నిర్వహించారని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రశ్నించారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారముందనే అహంకారంతోనే బుధవారం సమీక్ష నిర్వహించారని మండిపడ్డారు. షబ్బీర్ అలీకి అర్బన్ ప్రజలపై నిజంగా ప్రేమ ఉంటే అనేక సమస్యలు ఉన్నాయన్నారు. పదేళ్లుగా ఇళ్లు ఇవ్వలేదని, కొత్త రేషన్ కార్డులు లేవని, పింఛన్లు రావడం లేదని, రోడ్లు, డ్రెయినేజీలు సరిగ్గా లేవని, గ్యారంటీల అమలు కేవలం దరఖాస్తులకే పరిమితమయ్యాయని విమర్శించారు. నగరంలోని సమస్యలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లితో పాటు ఇతర మంత్రులను కలిసి విన్నవించానని, వాటి పరిష్కారానికి చొరవ చూడాలన్నారు. ఓడిపోయిన వ్యక్తికి అధికారులు, పోలీసులు గులాం గిరి చేస్తామంటే ఊరుకోబోమని ధన్‌పాల్ అన్నారు. ఇందూరు నగరం చాలా ప్రశాంతంగా ఉందని రాబోయే రోజుల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా షబ్బీర్ అలీ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఆయన బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల తరపున ప్రభుత్వ సలహాదారు మాత్రమేనని, శాసన, పరిపాలన విషయాల్లో జోక్యం చేసుకుంటే ఊరుకోబోమన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, మాస్టర్ శంకర్, సాధు సాయి వర్ధన్, నారాయణ, ప్రభాకర్, ముత్యాలు, ఖైజర్, గడ్డం రాజు, రోషన్, పుట్ట వీరేందర్, ఆనంద్, పవన్ ముందాడ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించడానికే క్యాంప్ ఆఫీస్



ఖలీల్‌వాడి : సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడానికి నిజామాబాద్ అర్బన్ క్యాంప్ కార్యాలయం ప్రారంభిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. బుధవారం నగరంలోని మారుతినగర్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడుగు గంగాధర్ చేత షబ్బీర్ అలీ క్యాంప్ ఆఫీస్‌ను ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. ఈ ఆఫీసుకు వచ్చి నగర ప్రజలు నేరుగా తమ సమస్యలు విన్నవించుకోవచ్చని తెలిపారు. రూపాయి ఖర్చు లేకుండా ప్రజలకు సేవలందిస్తామన్నారు. అనారోగ్యంతో ఉన్నప్పుడు ఎల్‌వోసీ, పింఛన్లు, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ వంటి పథకాల గురించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర కో ఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి గడుగు గంగాధర్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు, నాయకులు దయాకర్‌గౌడ్, ముప్పా గంగారెడ్డి, అరుణ్, నరేందర్‌సింగ్, బొబ్బిలి రామకృష్ణ, సుభాష్‌జాదవ్ ఉన్నారు.

క్లుప్తంగా

నేడు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సమావేశం



బోధన్: వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని పట్టణంలోని ఉర్దూఘర్‌లో గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మండల ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకట్, ఎం.అడవయ్య ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలతోపాటు పింఛన్ల పెంపు, ఉచిత బస్‌పాస్‌లు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, స్వయం ఉపాధి అంశాలపై చర్చ ఉంటుందని వివరించారు. వేదిక మండల అధ్యక్షుడు గైని రాములు, ప్రతినిధులు షేక్ నజీర్, దత్తాత్రి, ఎల్లయ్య, కరీం, నయీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారుకు సన్మానం



సుభాష్‌నగర్: నగరంలోని కలెక్టరేట్‌కు వచ్చిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్‌ను రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్రెసా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రెవెన్యూశాఖలో నెలకొన్న సమస్యలతోపాటు ధరణి సమస్యలను షబ్బీర్ అలీకి విన్నవించారు. సానుకూలంగా స్పందించిన షబ్బీర్ అలీ.. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రెవెన్యూ సమస్యల పరిష్కారించడంతోపాటు రెవెన్యూ సంఘం ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని తెలిపినట్లు ట్రెసా ప్రతినిధులు తెలిపారు. షబ్బీర్‌ను కలిసిన వారిలో ట్రెసా ప్రధానకార్యదర్శి, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్‌కుమార్, ఉపాధ్యక్షుడు భూపతి ప్రభు, తహసీల్దార్లు శ్రీనివాస్‌రావు, బాలరాజు, నాగార్జున, మహేశ్, సూపరింటెండెంట్లు పవన్, రాంచందర్, శ్రీకాంత్, దివ్య, అనిల్, సంతోష్, సంపత్, ప్రవీణ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఎడపల్లి (బోధన్): మండలకేంద్రం శివారులోని బ్రిడ్జి వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖలీద్ (36) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. బోధన్‌లోని రాకాసీపేట్‌కు చెందిన ఖలీద్ రాత్రివేళ బైక్‌పై నిజామాబాద్ నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. ఎడపల్లి శివారులోని బ్రిడ్జి వద్ద అతడి బైక్‌ను ఓ కారు ఎదురుగా వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఖలీద్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎడపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



సుభాష్‌నగర్‌లోని బుక్‌స్టాల్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు



గంజ్‌లోని విత్తనాల దుకాణంలో రైతులు

బడిబాట **సాగుబాట**

స్కూళ్లు పునఃప్రారంభం కావడంతో ఓ వైపు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో.. ఖరీఫ్ సీజన్ పనులు ప్రారంభం కావడంతో మరోవైపు రైతులతో మార్కెట్ కిటకిటలాడుతోంది. బుక్‌స్టాళ్లు, ఎరువులు, విత్తనాల దుకాణాలు కిక్కిరుస్తున్నాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

అవినీతికి తావు లేకుండా అభివృద్ధి



మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్: అవినీతికి తావు ఇవ్వకుండా, మధ్యవర్తులకు వాటాలు, కమీషన్లు లేకుండా ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధి తన లక్ష్యమని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ఎంపీ అర్వింద్ గెలుపులో ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలు కీలకంగా వ్యవహరించారని అన్నారు. ఆర్మూర్‌కు మంచి రోజులు వస్తున్నాయని, స్థానికంగా అభివృద్ధి చేసి చూపుతానని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డితోపాటు నలుగురు కేంద్ర , రాష్ట్ర మంత్రులను కలిసి అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరగా, వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. నందిపేట్‌లో అతిథిగృహం, మాక్లూర్‌లో మహిళా కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. గుంజిలి, కంఠం , మచ్చర్ల, ఫత్తేపూర్ ఎత్తిపోతల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. ఆర్మూర్ రైల్వే జంక్షన్‌ను డిచ్‌పల్లి లైన్‌కు కలపాలని రైల్వే మంత్రిని కోరగా, సానుకూలంగా స్పందించిన ఆయన అధికారులను పంపించి సర్వే చేయిస్తామని హామీ ఇచ్చారన్నారు. జక్రాన్‌పల్లిలో ఎయిర్ పోర్టు ఏర్పాటు విషయమై కేంద్ర మంత్రికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. అధికారులు అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో ఆర్మూర్ మున్సిపల్ మున్సిపల్ మాజీ చైర్మన్ కంచెట్టి గంగాధర్, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, జిల్లా అధికార ప్రతినిధి కలికోట గంగాధర్, నాయకులు పాన్ శ్రీనివాస్, ఆకుల రాజు, జాగిర్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ అశోక్ ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ ఎమ్మెల్యేతోపాటు నాయకులు రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు.

మినీ లిఫ్ట్‌కు విఠలేశ్వరుని పేరు పెట్టాలి



బొంకన్‌పల్లిలో మాట్లాడుతున్న విఠల్‌రావు

మాక్లూర్: త్వరలో ప్రారంభం కానున్న మినీ లిఫ్ట్‌కు విఠలేశ్వరుని పేరు పెట్టాలని మండలంలోని ముల్లంగి(బి), బొంకన్‌పల్లి గ్రామాల రైతులు జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుకు బుధవారం విన్నవించారు. ముల్లంగి(బి) గ్రామానికి వచ్చిన జెడ్పీ చైర్మన్ ఈ సందర్భంగా వారు కలిశారు. సానుకూలంగా స్పందించిన జెడ్పీ చైర్మన్ మినీ లిఫ్ట్‌కు ×విఠలేశ్వర లిఫ్ట్¤ అనే పేరు ఖరారు చేస్తామని హామీ ఇచ్చారు. రెండు గ్రామాల పరిధిలో వెయ్యి ఎకరాలకు నీరందించడమే లక్ష్యంగా రూ.11.70 కోట్లతో ధర్మోరా చెరువులో గుత్ప ఎత్తిపోతల నీటిని ఆధారంగా చేసుకొని లక్ష్మాపూర్ పంప్‌హౌస్ వద్ద మినీ లిఫ్ట్ నిర్మాణం అవుతోందన్నారు. అనంతరం పాఠశాలల ప్రాంగణాల్లో మొక్కలు నాటారు. ప్రభుత్వం అందించిన పాఠ్య, నోట్ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జె క్రాంతి, కె శ్యామ్‌రావు, ఎంపీటీసీ పూజిత, శైలు, ప్రమోద్, శ్రీరామ్, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఉర్దూఘర్‌కు పూర్వవైభవం తెస్తాం



అధికారులతో మాట్లాడుతున్న చైర్మన్ తాహెర్

బోధన్‌టౌన్(బోధన్): ఉర్దూఘర్‌కు పూర్వవైభవం తీసుకువస్తామని ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డైరెక్టర్ లియాఖత్ హుస్సేన్ అన్నారు. పట్టణంలోని ఉర్దూఘర్‌ను బుధవారం అధికారులతో కలిసి సందర్శించారు. ఉర్దూ ఘర్ నిరుపయోగంగా మారడానికి కారణాలు తెలుసుకున్నారు. ఉర్దూఘర్ ఆవరణలో ఇతరులు దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ఎవరు అనుమతించారని ప్రశ్నించారు. దీనిపై ఏడు రోజుల్లో నివేదిక అందించాలని తహసీల్దార్ గంగాధర్‌ను ఆదేశించారు. ఏడేళ్ల క్రితం కలెక్టర్ వేసిన కమిటీ రద్దయ్యిందని, నూతన కమిటీని ఏర్పాటు చేసి ఉర్దూఘర్ నిర్వహణలోకి వచ్చేలా చర్యలు చేపడుతామన్నారు. వారివెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పాషా మోయినొద్దీన్, డీసీసీ డెలిగేట్ గంగాశంకర్, కౌన్సిలర్లు శరత్‌రెడ్డి, మీర్ నజీర్ అలీ, ఇమ్రాన్, శ్రీకాంత్‌గౌడ్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, యువజన కాంగ్రెస పట్టణ అధ్యక్షుడు నవీన్, పట్టణ ప్రధాన కార్యదర్శి విష్ణు, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌసొద్దీన్ తదితరులు ఉన్నారు.

స్పోర్ట్స్ హాస్టల్‌లో ఖాళీల భర్తీకి ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్ రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్, అకాడమీలో ఖాళీల భర్తీకి ఈనెల 24, 25 తేదీల్లో ఉదయం 9గంటలకు పలు అకాడమీల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల యువజన అధికారి ముత్తెన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 నుంచి 18 సంవత్సరాల మధ్య వయసున్న బాలబాలికలు నేరుగా హాజరు కావాలని, స్టడీ సర్టిఫికెట్స్, బర్త్ సర్టిఫికెట్, 10 ఫొటోలు, ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని సూచించారు.

ఖాళీలు ఇలా..

సైక్లింగ్, కుస్తీ ఎంపికలు హైదరాబాద్‌లోని ఓయూ క్యాంపస్ అకాడమీలో ఉంటాయని, పూర్తి వివరాలకు 98663 17310, హనుమకొండలోని రీజినల్ స్పోర్ట్స్ అకాడమీ సీట్ల భర్తీ కోసం స్థానిక డీఎస్‌ఏ మైదానంలో ఎంపికలు ఉంటాయని, వివరాలకు 9392997668, వనపర్తిలోని హాకీ అకాడమీలో భర్తీ కోసం అక్కడి డీఎస్ఏ మైదానంలో ఎంపికలు ఉంటాయని, వివరాల కోసం 9885851813 సంప్రదించాలని సూచించారు. అలాగే సరూర్‌నగర్, రాజన్నసిరిసిల్ల జిల్లా వాలీబాల్ అకాడమీల్లో సీట్ల భర్తీ కోసం రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఎంపికలు ఉంటాయని, వివరాల కోసం 9440239783 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

21న అంతర్జాతీయ యోగా దినోత్సవం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని బస్వాగార్డెన్‌లో ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరు కానున్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరా రు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో, పాఠశాలల్లో, కళాశాలల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని, వాటికి సంబంధించిన ఫొటోలను 9100435410 నంబర్‌కు పంపితే కేంద్ర ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామన్నారు.

అనుమతి తప్పనిసరి

ఖలీల్‌వాడి: జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, గేమింగ్ జోన్‌లు, పార్కులు సంబంధిత శాఖల నుంచి ఎలాంటి అనుమతి లేకుండా నిర్వహిస్తున్నారని ఇకపై అధికారులు, పోలీసుల అనుమతి తప్పనిసరి అని సీపీ కల్మేశ్వర్ గురువారం పేర్కొన్నారు. సంబంధిత శాఖల నుంచి అనుమతి లేకుండా నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని డివిజన్ స్థాయి అధికారులకు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌వో, ఎస్సైలకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

హరితహారం చెట్లపై గొడ్డలివేటు



వాడి - చింతలూరు రోడ్డులో నరికిన చెట్లు

వేల్పూర్: 'పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు' అంటూ గత ప్రభుత్వం నాటిన హరితహారం మొక్కలు, చెట్లపై గొడ్డలి వేటు పడుతోంది. మండలంలోని వాడి నుంచి చింతలూరు వెళ్లే దారిలో రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలకు ఆనుకొని ఉన్న హరితహారం చెట్లను నరికివేస్తున్నారు. కిలోమీటరుపైగా రహదారికి ఇరువైపులా ఉన్న హరితహారం చెట్లను నరికివేసినట్లు తెలుస్తోంది. పదేళ్ల క్రితం గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించి మొక్కల పెంపకాన్ని చేపట్టింది. మొక్కలు నాటడం, సంరక్షించడం వంటి కార్యక్రమాన్ని జీపీ ద్వారా నిర్వహించింది. అంతేగాక మొక్కలు ధ్వంసం చేసినా, పెరిగిన చెట్లను కొట్టివేసినా జరిమానా విధించేవారు. గత ప్రభుత్వం ఉన్న పదేళ్ల కాలంలో మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యం ఇచ్చేవారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హరితహారం మొక్కల పెంపకం, పెరిగిన చెట్లను కాపాడే చర్యలు చేపట్టడం లేదు. వాటిని నరికివేయకుండా కఠినమైన చర్యలు తీసుకోకపోవడం, అధికారులు కూడా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. హరితహారం మొక్కలు, చెట్లు నరికివేయకుండా అధికారులు కఠినమైన చర్యలు తీసుకొని వాటిని సంరక్షించాలని ప్రజలు, హరిత ప్రేమికులు కోరుతున్నారు.

ఢిల్లీ సదస్సులో రాష్ట్ర వినియోగదారుల మండలి బాధ్యులు





కేంద్ర ఉన్నతాధికారులతో వినియోగదారుల మండలి రాష్ట్ర ప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: భారత వినియోగదారుల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 18, 19 తేదీల్లో న్యూఢిల్లీలో వినియోగదారుల మండలి జాతీయ సమావేశాలు జరిగాయి. మండలి జాతీయ చైర్మన్ డాక్టర్ అనంత్ శర్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశాల్లో రాష్ట్రం నుంచి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్, క్యాట్కో చైర్మన్ శంకర్‌లాల్ చౌరాసియా, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు పెండోట అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్ పాల్గొన్నారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ చీఫ్ సెక్రెటరీ నిధి ఖరే, అడిషనల్ సెక్రెటరీ అనుపమ్ మిశ్రా, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రమోషనల్ ఆఫీసర్ రాహుల్‌రాజ్ సదస్సుకు హాజరైన అన్ని రాష్ట్రాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. బంగారు ఆభరణాలపై హెచ్‌యూఐడీ నంబర్‌ను వ్యాపారులు నమోదు చేయకపోవడం, అదనంగా వీఏ చార్జీలు వసూలు చేయడంపై చర్చ జరిగింది. అదేవిధంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఫోర్టిఫైడ్ రైస్ ప్రాధాన్యత, ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా వినియోగదారుల చైతన్యం, ప్రభుత్వ యూనివర్సిటీల్లో వినియోగదారుల స్టడీ సెంటర్ల ఏర్పాటు, తెలంగాణలో తీవ్ర ప్రభావం కలిగి ఉన్న ఆహార కల్తీ, నకిలీ మందుల సంఘటనలు వెలుగులోకి వచ్చిన విషయమై అధికారులు చర్చించారు. రియల్ ఎస్టేట్ రంగంలో మహారాష్ట్ర తరువాత హైదరాబాద్ రెండో స్థానంలో ఉన్న నేపథ్యంలో వినియోగదారులను చైతన్యం చేయాలని నిధి ఖరే అన్నారు. కేంద్ర వినియోగదారుల హక్కుల పరిరక్షణ అథారిటీ సీసీపీఏ, నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్ 1915పై విస్తృత ప్రచారం చేయాలని నిధి ఖరే వినియోగదారుల ప్రతినిధులను కోరారు.

నూతన జాతీయ విద్యావిధానం ప్రకారమే బోధించాలి

జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బీ



మాట్లాడుతున్న సంక్షేమ అధికారిణి రసూల్ బీ

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): జాతీయ విద్యావిధానం, నూతన జాతీయ పాఠ్యప్రణాళిక-2024 ప్రకారం 3-6 ఏళ్ల వయసు గల పిల్లల అవసరాలకు తగినట్లు బోధించాలని జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బీ సూచించారు. కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ విడుదల చేసిన 'పూర్వ ప్రాథమిక సంరక్షణ, విద్యకు సంబంధించిన జాతీయ పాఠ్యప్రణాళిక'లో భాగంగా పూర్వ ప్రాథమిక విద్య పాఠ్యప్రణాళిక-2024 పై డిచ్‌పల్లి ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు జిల్లా కేంద్రంలోని డీఆర్‌సీలో బుధవారం ప్రీ-స్కూల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లను 8 బ్యాచ్‌లుగా విభజించి ఈ నెల 19 నుంచి జూలై 24వరకు బ్యాచ్‌ల వారీగా పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీల్లో హాజరు శాతం పెంచాలన్నారు. ఆట, పాట, ప్రత్యక్ష అనుభవాల ద్వారా పిల్లలకు అభివృద్ధి అవకాశాలు అందించేందుకు పూర్వ విద్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి ప్రాజెక్టు అధికారి స్వర్ణలత, ట్రైనీ సూపర్‌వైజర్లు సరిత, శోభ, బుజ్జి, డీహెచ్‌ఈడబ్ల్యూ పుష్ప, ఐటీ ప్రకాశ్, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ రంజిత్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

బోనస్‌కు ఆశపడి సైబర్ వలలో చిక్కిన యువకుడు

బాన్సువాడ రూరల్: వాట్సాప్‌లో వచ్చిన లింక్‌ను ఓపెన్ చేసి గూగుల్ మ్యాప్ రివ్యూకు రేటింగ్ ఇచ్చిన మండలంలోని తాడ్కోల్‌కు చెందిన యువకుడికి రూ.200 చొప్పున రెండుసార్లు ఫోన్‌పే ద్వారా బోనస్ జమయ్యాయి. ఆ తరువాత సదరు యువకుడికి అంజూశర్మ అనే వ్యక్తి టెలీగ్రామ్ ద్వారా మరో లింక్‌ను పంపి డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే డబ్బులు వస్తాయని తెలుపడంతో రూ.7వేలు జమ చేశాడు. మళ్లీ రాజేశ్‌కుమార్ అనే వ్యక్తి పంపిన మరో లింక్‌కు రూ.28వేలు, మన్‌దీప్ అనేవ్యక్తి పంపిన లింక్‌కు రూ.58వేలు, ఓ అకౌంట్‌నంబర్ రూ.50వేలు, మరోసారి రూ.12వేలు ఇలా పలు విడుతల్లో రూ.2.09లక్షలు పంపించాడు. అయితే, సైబర్ మోసగాళ్లు మరిన్ని డబ్బులు పంపితే అన్నీ కలిపి ఒకేసారి పంపిస్తామని చెప్పడంతో తాను మోసపోయినట్లు యువకుడు గ్రహించాడు. వెంటనే 1930కు ఫిర్యాదు చేయగా, రూ.62వేలు హోల్డ్‌లో పడ్డాయి. ఈనెల 8వ తేదీన సైబర్‌మోసం చోటు చేసుకుంది. 1930 సర్వీస్ అధికారుల సూచన మేరకు యువకుడు గురువారం బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు.

కూలి డబ్బుల విషయంలో గొడవపడి ఆత్మహత్య

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కూలి డబ్బుల విషయంలో భర్తతో గొడవ పడిన భార్య క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన కొలకొండ హరీశ్, లక్ష్మి భార్యాభర్తలు. హరీశ్ కూలీ పనులు చేస్తుండగా, కూలి డబ్బుల విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన లక్ష్మి(28) ఇంట్లో ఎవరూ లేనిసమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని ఎస్సై రాజు తెలిపారు. మృతురాలి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపానికిగురై..



గణేశ్(ఫైల్)

ఇందల్వాయి: మండలంలోని త్రియంబకపేటకు చెందిన బైరి గణేశ్(22) అనే యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మనోజ్ తెలిపారు. ఉపాధినిమిత్తం విదేశాలకు వెళ్లిన బైరి గణేశ్ అనారోగ్యం కారణంగా తిరిగి వచ్చేశాడని, దీనికితోడు అప్పులు కావడంతో తీవ్రమనస్తాపానికి గురై మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నా రు. మృతుడి తల్లి సుగుణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం



దంపతులు సాయిలు, పోశవ్వ (ఫైల్)

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎక్లాస్‌పూర్ క్యాంపు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందారు. కొత్తపల్లి -కోటగిరి రోడ్డుపై చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. కోటగిరి మండలంలోని కొత్తపల్లికి చెందిన పుప్పాల సాయిలు అలియాస్ సాయిబాబా (52), పోశవ్వ(50) దంపతులు కూరగాయల కోసం మండల కేంద్రంలోని వారంతపు సంతకు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. ఎక్లాస్‌పూర్ క్యాంపు వద్దకు చేరుకున్న క్రమంలో వాహనం అదుపుతప్పి పడిపోయి మృతి చెందారని స్థానికులు తెలిపారు. దంపతుల మృతితో కొత్తపల్లిలో విషాదచాయలు అలుముకున్నాయి. తమతో కలిసిమెలిసి ఉండే సాయిబాబా, పోశవ్వ మృతిని జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనం టైర్‌పేలి లేదా గుర్తు తెలియని వాహనం ఢీకొని ప్రమాదం జరిగి ఉంటుందని మృతుడి సోదరుడు సైదయ్య అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



రాజేశ్వర్(ఫైల్)

మాక్లూర్: మండలంలోని ఒడ్యాట్‌పల్లి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామడోల్ల రాజేశ్వర్ (55) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. తెలుగుదేశం హయాంలో రాజేశ్వర్ రెండుసార్లు సర్పంచ్‌గా పని చేశారు. తెలంగాణ సాధన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఆయన బీఆర్ఎస్‌లో చేరి సర్పంచ్‌గా తన భార్య సుధను గెలిపించుకున్నారు. ఆ తరువాత మళ్లీ కాంగ్రెస్‌లో చేరి చురుకైన పాత్రపోషించారు. బుధవారం ఛాతిలో నొప్పి వస్తోందని చెప్పడంతో కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. మృతుడికి భార్య సుధ, కుమారులు రాహుల్, నాగేంద్ర బాబు ఉన్నారు. రాజేశ్వర్ అంత్యక్రియలను శుక్రవారం స్వగ్రామమైన ఒడ్యాట్‌పల్లిలో నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి..



సాయిలు (ఫైల్)

పెద్దకొడప్‌గల్: ప్రమాదవశాత్తు కాలుజారి కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన మేత్రి సాయిలు(28) కాలకృత్యాలు తీర్చుకునేందుకు బుధవారం ఉదయం మాలకుంట ప్రాంతానికి వెళ్లి కాలు జారిపడి నీటిలో మునిగిపోయాడు. ఊబిలో చిక్కుకుని ఊపిరాడక సాయిలు మృతి చెందాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు సాయిలు మృతదేహాన్ని బయటికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సవిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి యువకుడు..

నవీపేట: మండలంలోని మహంతం శివారులో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ సాయికుమార్ (24) మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వ్యవసాయ పనుల్లో భాగంగా బుధవారం పొలంలో డ్రమ్ము కొడుతుండగా ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో ప్రమాదం జరిగిందన్నారు. సాయి కుమార్‌పై ట్రాక్టర్ పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడని పేర్కొన్నారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

అత్యాచారం చేశారని ఆరేళ్ల బాలురకు వాతలు !

మాచారెడ్డి: ఆరేళ్ల ఇద్దరు బాలురు అదే వయసున్న బాలికపై అత్యాచారం చేశారంటూ సదరు బాలిక అమ్మమ్మ ఆ బాలికతో పాటు ఇద్దరు బాలుర తొడలపై వాతలు పెట్టిన ఘటన మంగళవారం రాత్రి పాల్వంచ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కాగా ఈ ఘటన సమయంలో తాము ఇంట్లో లేమని, తమ పిల్లల తొడలపై అతి కిరాతకంగా వాతలు పెట్టిన మహిళ పై చర్యలు తీసుకోవాలని బాలుర తల్లిదండ్రులు మాచారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయక్ నగర్‌లో కొనసాగుతున్న ఓ వ్యభిచార గృహంలో పోలీసులు బుధవారం సాయంత్రం దాడి చేశారు. ఓ మహిళతోపాటు విటుడిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై సంజీవ్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైతులపై దాడి చేసిన వారిపై కేసు

రుద్రూర్: పొతంగల్ మండల పరిధిలోని మంజీర నది వద్ద రైతులపై దాడి చేసిన మహారాష్ట్రకు చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పొలం వద్దకు వెళ్లిన తమతో దురుసుగా ప్రవర్తించి మహారాష్ట్రకు చెందినవారు దాడి చేశారని పొతంగల్‌కు చెందిన రైతు గంగారాం ఫిర్యాదు చేశాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వివాహిత అదృశ్యం

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన ఓ వివాహిత ఇద్దరు పిల్లలతోపాటు అదృశ్యమైంది. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులు బీర్కూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బహ్రెయిన్‌లో సిర్‌పూర్‌వాసి మృతి



బాలరాజు (ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని సిర్‌పూర్ గ్రామానికి చెందిన చెన్నూరు బాలరాజు (46) బహ్రెయిన్‌లో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. బాలరాజు గత 15 ఏళ్లుగా ఉపాధినిమిత్తం బహ్రెయిన్‌తోపాటు గల్ఫ్ దేశాలకు వెళ్తున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన బాలరాజు రెండు నెలల క్రితం తిరిగి బహ్రెయిన్‌కు వెళ్లాడు. విధుల్లో ఉండగా విద్యుత్ షాక్ తగిలి బాలరాజు శనివారం మృతిచెందగా, కుటుంబ సభ్యులకు ఐదు రోజులు ఆలస్యంగా బుధవారం రోజున కంపెనీ ప్రతినిధులు, ఉద్యోగులు సమాచారం అందించారు. సమాచారమిచ్చారు. కుటుంబ పెద్ద మృతిచెందడంతో భార్య భాగ్య, ఇద్దరు కుమారులు, బంధువులు, తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి త్వరగా తీసుకొచ్చేలా ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబసభ్యులు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల అవకతవకలపై నలుగురికి జైలు

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల నిధుల అవకతవకల విషయంలో నలుగురు అధికారులకు జైలు శిక్ష పడినట్లు లింగంపేట ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2009 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం శెట్పల్లి సంగారెడ్డి, లొంకల్‌పల్లి, మాలపాటి, ఎక్కపల్లి, ఎక్కపల్లి తండా, సజ్జన్‌పల్లి గ్రామాల్లో ఇందిరమ్మ గృహాల నిధుల దుర్వినియోగంపై లింగంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. కోర్టులో చార్జిషీట్ వేసి కేసు విచారణ జరుపగా బుధవారం నాడు ఎల్లారెడ్డి కోర్టు మెజిస్ట్రేట్ హారిక తీర్పు ఇచ్చారు. ఈ తీర్పులో ఏఈ సంపత్‌కుమార్ (హౌజింగ్), ఏఈ బిక్కులాల్ (హౌజింగ్), విలేజ్ వాలంటీర్లు వజ్రమ్మ, రాజమణి నేరం చేసినట్లు రుజువైందని పేర్కొన్నారు.

దీంతో వారికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధించారు. జరిమానా కట్టని యెడల ఆరు నెలల జైలు శిక్ష విధించారు. సదరు కేసును పీపీ వీరయ్య వాదించినట్లు ఎస్సై తెలిపారు.